సాక్షి జగిత్యాల

ఆదివారం । 24 । మార్చి । 2024



వేసవిలో 'మ్యాడంపల్లి' దోస

మండు వేసవిలో డిమాండ్ ఉండటమే కాకుండా.. స్వల్పకాలంలో ఆదాయం వచ్చే దోస కాయ పంటపై ఈ గ్రామ రైతులు దృష్టి సారించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ ఆది (సా॥)	సహర్ సోమ (ఉ॥)
కరీంనగర్	6.26	4.47
పెద్దపల్లి	6.06	4.41
రాజన్న సిరిసిల్ల	6.33	4.55
జగిత్యాల	6.33	4.54

గరిష్టం/కనిష్టం
34.0/22.0

వాతావరణం

వాతావరణం వేడిగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోత పెరుగుతుంది.

మత్తు జోరు.. బెట్టింగ్ హోరు



- ఉమ్మడి జిల్లాను చీడల్లా వెంటాడుతున్న జాఢ్యాలు
- జగిత్యాలలో వరుస ఘటనలతో కలవరం
- ఐపీఎల్‌తో మొదలైన ఆన్‌లైన్ బెట్టింగ్
- క్రెడిట్‌కార్డుల వినియోగం, ఆపై అప్పుల పాలు
- ఒత్తిడి పెరిగి డిప్రెషన్‌లోకి బెట్టింగ్‌బాబులు

సాక్షిప్రతినిధి,కరీంనగర్:

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో యువతను రెండు జాఢ్యాలు వెంటాడుతున్నాయి. ఒకటి గంజాయి, మరోటి బెట్టింగ్. జగిత్యాలలో బాలిక గంజాయికి బానిసైన తీరు రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. అదే సమయంలో కరీంనగర్ జిల్లాకేంద్రంలో ఈ వారంలో ఆన్‌లైన్ గేమ్స్‌లో మితిమీరిన అప్పులు చేసి, తీర్చే మార్గం తెలియక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు వాస్తవాలు వెల్లడించకపోయినా.. ఇలాంటి ఘటనలు వెలుగుచూస్తున్నాయి. తక్కువ కాలంలో కోటీశ్వరులు కావాలన్న అత్యాశతో బెట్టింగ్ వైపు, మత్తులో విహరించి లోకాన్ని ఏలాలన్న కోరికతో కొంత మంది యువత గంజాయి, మత్తు పదార్థాలకు బానిసకావడం ఆందోళన కలిగిస్తోంది.

లోన్ యాప్స్, క్రెడిట్ కార్డ్స్‌తో బెట్టింగ్..

ఇక ఉమ్మడి జిల్లా యువతలో కొందరు ఎదుర్కొంటున్న ప్రాణాంతక జాఢ్యం బెట్టింగ్. దీంతోపాటు ఆన్‌లైన్ గేమింగ్స్ కూడా. ప్రస్తుతం ఐపీఎల్ సీజన్ మొదలైంది. ఇది రెండునెలలపాటు సాగనుంది. ఇప్పటికే తెలివిగా బెట్టింగ్ యాప్స్ నిర్వాహకులు ప్రచారం ప్రారంభించారు. ఫలానా కూలీకి బెట్టింగ్‌లో ఇన్ని రూ.కోట్లు వచ్చాయని, బిచ్చగాళ్ల బిలియనీర్లు అయ్యారని సోషల్ మీడియాలో ప్రచారం. వాస్తవానికి యువతను యాప్స్ వైపు లాగేందుకు ఇదో ఎత్తుగడ. ఇందులో వీరు ప్రతీసారి సక్సెస్ అవుతుండటం గమనార్హం. సరే బెట్టింగ్ యాప్ డౌన్‌లోడ్ చేశాక..బెట్టింగ్ కోసం డబ్బు ఎలా? చేతిలో ఉన్నా డబ్బు సరిపోదు, అందుకే ఈ సమయంలోనే ఎలాంటి సంపాదన లేకుండా రూ.లక్షల కొద్దీ లిమిట్ ఇస్తూ ఉత్తపుణ్యానికి అంటగడుతున్న క్రెడిట్ కార్డ్స్, ఎలాంటి ష్యూరిటీ లేకుండా రూ.లక్షలు అప్పు ఇస్తున్న మనీలోన్ యాప్స్‌ను వీరు ఆశ్రయిస్తున్నారు.

తీర్చలేక తీవ్ర నిర్ణయాలు..

గంజాయికి అలవాటు పడ్డ వాళ్లు నేరాలు చేస్తూ బహిరంగంగానే దొరికిపోతున్నారు. ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్‌కు చేతిలో డబ్బులు లేకున్నా.. లోన్‌యాప్స్, క్రెడిట్ కార్డ్స్‌లను వాడి రూ.లక్షలు అప్పులు చేస్తున్నారు. వీటిని తిరిగి తీర్చాలన్నపుడు అసలు కథ మొదలవుతుంది. కొందరు మరోచోట అప్పుచేసి కడుతుండగా మరికొందరు పాగొట్టుకున్న చోటే రాబట్టుకుందామన్న సిద్ధాంతంతోనే, లేక ఎలాగూ మునిగాం కదా అని మరింత అప్పు చేసి పీకల్లోతు ఊబిలోకి కూరుకుపోతున్నారు. ఈక్రమంలోనే వీరు ఒత్తిడికి గురవుతున్నారు. బ్యాచిలర్లయితే ఆత్మహత్యలకు పాల్పడటం లేదా వివాహితుల్లో కొందరు పెళ్లాం పిల్లలను చంపి తాము చావడం లాంటి అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. రూ.లక్షలు అప్పు చేస్తున్న వారంతా ఉన్నత విద్యావంతులు, ప్రభుత్వ ఉద్యోగులు కావడం ఇక్కడ గమనార్హం.

కలెక్టర్, ఎస్పీ సీరియస్

గంజాయికి బానిసైన బాలిక విషయంపై మీడియాలో భిన్న కథనాలు రావడంతో జగిత్యాల కలెక్టర్ యాస్మిన్ బాషా, ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ తీవ్రంగా పరిగణించారు. ఇటీవల ఇదే జిల్లాకేంద్రంలో ఓ ఈఎన్టీ ఆసుపత్రి వైద్యుడు మార్ఫిన్ ఇంజెక్షన్లను అడ్డదారిలో అమ్ముతూ దొరికిపోయిన విషయం తెలిసిందే. జిల్లాలో వరుసగా ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం ఆందోళనకరం. నివారణ చర్యలు చేపట్టడంతోపాటు, జరుగుతున్న ప్రచారంపైనా నిశితంగా నిఘా ఉంచారు. బాలిక మతిస్థిమితం తప్పేంతలా గంజాయి వినియోగంచడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. బాలికకు అంత గంజాయి ఎలా వచ్చింది? ఎవరు విక్రయించారు? ఎవరు అలవాటు చేశారు? తదితర విషయాలపై పోలీసులు కూపీ లాగుతున్నారు. ఈ విషయంలో ఇప్పటికే పలువురిని అరెస్టు చేశారు. మరోవైపు కరీంనగర్ జిల్లాకేంద్రం, శివారులోని తిమ్మాపూర్, కొత్తపల్లి, చొప్పదండిలో వివిధ కాలేజీలో చదువుతున్న విద్యార్థులు గంజాయికి అలవాటు పడ్డారు. చాలామంది కేవలం గంజాయి తాగేందుకే ప్రత్యేకంగా రూములు అద్దెకు తీసుకుంటున్నారంటే వీరి జల్సాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. గతంలో చొప్పదండిలో ఇలాంటి స్థావరాలపై పోలీసులు దాడి చేసినా.. గంజాయిరాయుల తీరులో మార్పు రావడం లేదు. వీరిలో చాలామంది పోలీసులకు అనేకసార్లు పట్టుబడ్డారు. వీరిలో కొందరు దీన్నే వృత్తిగా స్వీకరించి, సులువుగా డబ్బు సంపాదించేందుకు శాశ్వతంగా గంజాయి పెడ్లర్ల అవతారమెత్తడం గమనార్హం. గంజాయి ఏజెన్సీ ప్రాంతాల నుంచి మంచిర్యాల, మంథని, భూపాలపల్లి మీదుగా జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్ తదిరల ప్రాంతాలకు సరఫరా అవుతోంది.

గంజాయి విక్రేత అరెస్ట్

జగిత్యాలక్రైం: జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ శివారులో శనివారం సాయంత్రం అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 260 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఆరిఫ్ అలీఖాన్, రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు. జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేటకు చెందిన మైదం అజయ్ శనివారం సాయంత్రం ధరూర్ శివారులో అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులకు సమాచారం అందింది. ఎస్సై సదాకర్ అక్కడకువెళ్లి అజయ్‌ని తనిఖీ చేయగా అతని వద్ద 260 గ్రాముల గంజాయి లభ్యమైంది. గంజాయిని స్వాధీనం చేసుకుని అజయ్‌పై కేసునమోదు చేసినట్లు సీఐ వివరించారు.

సాఫ్ట్‌వేర్ కంట్రోల్ చేస్తుంది



ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ యాప్స్ విషయంలో గమనించాల్సింది ఏంటంటే అవతల ఆడేది కంప్యూటరే. దానిలోని సాఫ్ట్‌వేర్ ముందు గెలిపించి, తరువాత ఓడిపోయేలా చేస్తుంది. ఈ విషయం తెలియక చాలా మంది ముందు తాము ఏదో గెలిచామన్న భావనతో అప్పులు చేసి గేమ్స్ ఆడుతారు. ఇదంతా పథకం ప్రకారం జరిగే ప్రక్రియ. ఒత్తిడి భరించలేక యువత ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇలాంటి ప్రమాదకర బెట్టింగ్ యాప్స్‌పై ప్రభుత్వం సైతం అవగాహన కల్పించాలి. – వీరేందర్, సైకాలజిస్ట్

న్యూస్‌రీల్

క్షయ నివారణ అందరి బాధ్యత



ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది

జగిత్యాల: క్షయవ్యాధి నివారణ ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని డెప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ అన్నారు. క్షయ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జిల్లా కేంద్రంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో ఏటా 1900 కేసులు నమోదువుతున్నాయని, ఈఏడాది మార్చి వరకు 426 కేసులు గుర్తించామని పేర్కొన్నారు. రెండువారాలకు మించి దగ్గు తగ్గకపోవడం.. ఆకలి లేకపోవడం, జ్వరం రావడం.. బరువు తగ్గడం వంటి లక్షణాలుంటే వెంటనే తెమడ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. క్షయ బాధితులకు ఉచితంగా మందులు అందించడంతోపాటు ప్రతినెలా రూ.500 అందిస్తామని పేర్కొన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వైద్యులు గీతిక, శ్రావణి, స్వాతి, కట్ట హరీశ్ పాల్గొన్నారు.

తెలంగాణ స్టీల్‌కు అత్యంత ప్రాధాన్యం



కార్యక్రమంలో పాల్గొన్న టిలో రఫ్రాన్

మెట్‌పల్లి: తెలంగాణలో లభించే ఇనుము (స్టీల్)కు ప్రపంచవ్యాప్తంగా ఎంతో ప్రాధాన్యత ఉందని సైప్రస్ యూనివర్సిటీ ప్రొఫెసర్ టిలో రఫ్రాన్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను శనివారం ఆయన సందర్శించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో లభించే ఇనుము ప్రాచీనమైనదని, విదేశాల నుంచి ఎంతోమంది ఇక్కడకు వచ్చి పరిశోధనలు చేస్తున్నారని పేర్కొన్నారు. అంతకుముందు ప్రిన్సిపాల్ బూర్ల చంద్రశేఖర్, ఉపన్యాసకులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో చరిత్రకారుడు జైకిషన్, డాక్టర్ మేఘన, డాక్టర్ రమేష్ తదితరులున్నారు.

జేఎన్టీయూలో నైబర్‌వుడ్ యూత్ పార్లమెంట్



నైబర్‌వుడ్ యూత్ పార్లమెంట్ కార్యక్రమంలో విద్యార్థులు

కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాల మండలంలోని జేఎన్టీయూలో నెహ్రూ యువజన కేంద్రం జగిత్యాల ఆధ్వర్యంలో జిల్లాస్థాయి నైబర్‌వుడ్ యూత్ పార్లమెంట్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ కామాక్షి ప్రసాద్ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు అప్పుడప్పుడు ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. 18ఏళ్లు నిండిన ప్రతిఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు. నెహ్రూ యువజన కేంద్రం జిల్లా అధికారి ఎం.వెంకటరాంబాబు, కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి ప్రవీణ్ విద్యార్థులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో శనిత్రయోదశి వేడుకలు



శని దేవునికి తైలాభిషేకం చేస్తున్న భక్తులు

కోరుట్ల: పట్టణంలోని అయ్యప్ప జ్ఞాన సరస్వతిశనైశ్చర స్వామి ఆలయంలో శనివారం శనిత్రయోదశి వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రత్యేకపూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. 70 మంది దంపతులు శనీశ్వరునికి సామూహిక తైలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆలయ గౌరవ అధ్యక్షుడు చిద్రాల నారాయణ స్వామి, అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, అర్చకులు గౌతంశర్మ, తిపాఠిశర్మ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ



సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

జగిత్యాల: పదో తరగతి పరీక్ష కేంద్రాలను కలెక్టర్ యాస్మిన్ బాషా శనివారం పరిశీలించారు. విద్యార్థులు ఒత్తిడికి లోనుకావద్దని, అత్యధిక మార్కులు సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. నాలుగో రోజు రెగ్యులర్ విద్యార్థులు 11,396 మందికి 11,376 మంది హాజరయ్యారు. సప్లిమెంటరీ విద్యార్థులు 651మందికి 623 మంది హాజరయ్యారు. ఆమె వెంట డీఈవో జగన్మోహన్‌రెడ్డి ఉన్నారు.

భగత్‌సింగ్ జీవిత చరిత్రను పాఠ్యాంశంలో చేర్చాలి



నివాళులర్పిస్తున్న నాయకులు

జగిత్యాల: భగత్‌సింగ్ జీవిత చరిత్రను పాఠ్యాంశంలో చేర్చాలని సీఐటీయూ నాయకులు అన్నారు. ప్రజాసంఘాల ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. స్వాతంత్య్రం కోసం ప్రాణాలు వదిలిన భగత్‌సింగ్ వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలని, భారతరత్న ప్రకటించాలన్నారు. యువత హక్కుల కోసం పోరాడాలన్నారు. సీఐటీయూ కన్వీనర్ సులోచన, వినోద్‌కుమార్, బచ్చల వినోద్ పాల్గొన్నారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో శివసాయిరెడ్డి, రాహుల్, నాగరాజు, అర్చన, కల్యాణి పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్యం



ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి నిర్వహించిన చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శనలు అలరించాయి. ధర్మపురికి చెందిన గాయకుడు గుండి జగదీశ్వర్‌శర్మ బృందం భక్తి సంగీతం ఆకట్టుకుంది. కళాకారులను దేవస్థానం పక్షాన స్వామివారి శేష వస్త్రం కప్పి, ప్రసాదాలు అందించారు.

మోదీ పథకాలు ప్రజలకు వివరించాలి



తుంగూర్‌లో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

సారంగాపూర్: ప్రధాని నరేంద్ర మోదీ పథకాలను ప్రజలకు వివరించాలని, రానున్న ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించుకుని మూడోసారి మోదీని ప్రధానిని చేయాలని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ అన్నారు. సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల బీజేపీ కార్యకర్తలతో బీర్‌పూర్ మండలం తుంగూర్‌లో సమావేశమయ్యారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ వైఫల్యాలను ప్రజలముందు ఉంచాలని సూచించారు. ముందుగా పలువురు పార్టీలో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. జెడ్పీటీసీ పాత పద్మ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి, జిల్లా అధ్యక్షుడు పైడిపల్లి సత్యనారాయణరావు, రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగన్న, పార్టీ మండలాల అధ్యక్షులు ఆడెపు నర్సయ్య, ఎండబెట్ల వరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీవేంకటేశ్వర స్వామికి ఊరేగింపు సేవ

ధర్మపురి: ధర్మపురి లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీవేంకటేశ్వర స్వామి ఊరేగింపు సేవను ఘనంగా నిర్వహించారు. ఆలయం నుంచి పురవీధుల మీదుగా మేళతాళాల మధ్య ఊరేగించారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఈవో శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులున్నారు.

రోజుకు పది ట్రిప్పులే..



కోరుట్లలోని వాగు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు

- మన ఇసుక వాహనం తీరు
- ఆగని అక్రమ ఇసుక రవాణా
- రెవెన్యూ.. మైనింగ్ అధికారుల నిర్లిప్తత

కోరుట్ల: ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు.. సర్కార్‌కు ఆదాయం పెంచడమే లక్ష్యంగా రెవెన్యూ యంత్రాంగం ప్రారంభించిన మన ఇసుక వాహనం పథకానికి స్పందన అంతంతమాత్రంగానే వస్తోంది. రెవెన్యూ, మైనింగ్ అధికారులు ఇసుక రవాణా నియంత్రణపై పెద్దగా దృష్టి సారించకపోవంతో మన ఇసుక వాహనం నీరుగారుతోందన్న అనుమానాలు వెంటాడుతున్నాయి.

నెల రోజుల క్రితం..

ఫిబ్రవరి 14న జిల్లాలో మన ఇసుక వాహనం పథకాన్ని జిల్లా అధికారులు ప్రారంభించారు. ధర్మపురి మండలంలో ఆరెపల్లి, రాజారం, కోరుట్ల మండలంలో పైడిమడుగు, రాయికల్ మండలంలో ఇటిక్యాల, జగన్నాథ్‌పూర్, మల్లాపూర్ మండలంలో సాతారం, మెట్‌పల్లి మండలంలో ఆత్మకూర్, కథలాపూర్ మండలంలో తక్కళ్లపల్లి ఇసుక రీచ్‌ల నుంచి తరలించడానికి అవకాశం ఇచ్చారు. ఇసుక రీచ్‌ల నుంచి కేవలం 5 కిలోమీటర్ల లోపు దూరం ఉంటే ట్రాక్టర్ ఇసుక, రవాణా చార్జీలతో కలిపి రూ.1500, అంతకుమించి 50 కిలోమీటర్ల లోపు దూరం ఉంటే ట్రాక్టర్ ఇసుకకు రూ.5 వేలుగా నిర్ణయించారు. మొబైల్ యాప్ ద్వారా నేరుగా వినియోగదారుడు ఇసుక రీచ్ నుంచి ఇసుక ట్రిప్పులు బుక్ చేసుకునే వెసులుబాటు కల్పించారు. అనంతరం మొబైల్ యాప్ ద్వారా ఇసుకను బుక్ చేసుకునే అంశంపై ప్రజలకు అవగాహన కల్పించారు. దీనికి తగ్గట్లు ఇసుక తరలించేందుకు వాహనాలు నమోదు చేసుకునే అవకాశం కల్పించారు.

రోజుకు పది ట్రిప్పులే నమోదు

జిల్లాలోని ఎనిమిది ఇసుక రీచ్‌ల్లో మన ఇసుక వాహనం పథకం కింద 35 రోజుల వ్యవధిలో కేవలం 2,102 ట్రిప్పుల ఇసుక మాత్రమే బుక్ అయినట్లు మైనింగ్ అధికారుల రికార్డులు చెబుతున్నాయి. ఈ లెక్కన ఒక్కోరీచ్‌లో రోజుకు పది ట్రిప్పుల ఇసుక మాత్రమే ఇసుక వాహనం పథకం కింద తరలించినట్లు తేలుతోంది. ఇంత తక్కువగా ఇసుక వాహనం పథకం కింద ట్రిప్పులు నమోదు కావడం విస్మయం కలిగిస్తోంది. జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్, మల్యాల వంటి పట్టణాల్లో వందలాది కాంప్లెక్సులు, వేలాది ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. దీనికి తోడు గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇళ్ల నిర్మాణానికి ఇసుక అవసరం ఉంటుంది. ఆయా ప్రాంతాల్లో వేలాది ట్రిప్పుల ఇసుక ట్రిప్పులు అవసరం ఉండగా.. రీచ్‌ల్లో మాత్రం రోజుకు కేవలం పది ట్రిప్పుల ఇసుక మాత్రమే బుక్ అవుతుండటం ఇబ్బందికరంగా మారింది.

రెవెన్యూ..మైనింగ్ అధికారుల నిర్లిప్తత

జిల్లాలో మన ఇసుక వాహనం పథకం ప్రారంభించిన సమయంలో అధికారులు ఇసుక అక్రమ రవాణాపై పక్కాగా దృష్టి సారించారు. వారంపాటు అక్రమ రవాణాను అడ్డుకోవడంలో కఠినంగా వ్యవహరించారు. ఆ తరువాత కాలంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా జిల్లాలోని వాగులు, వంకలు నుంచి పెద్ద ఎత్తున ఇసుక అక్రమంగా తరలిపోతోంది. రెవెన్యూ, మైనింగ్ అధికారులు అక్రమ ఇసుక తరలింపు జోరుగా సాగుతున్నా పట్టీపట్టనట్లుగా వ్యవహరించిన ఫలితంగా క్రమేపీ ఇసుక వాహనం కింద ట్రిప్పుల బుకింగ్ తగ్గిపోతుంది. రెవెన్యూ, మైనింగ్ అధికారులు ఇసుక అక్రమ రవాణా విషయంలో నిక్కచ్చిగా వ్యవహరించకుంటే ఇసుక వాహనం పథకం నీరుగారిపోయే ప్రమాదం పొంచి ఉంది.

అక్రమ రవాణాపై నిఘా పెంచాం

ఇసుక అక్రమ రవాణాపై నిఘా పెంచాం. ఎప్పటికప్పుడు సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తున్నారు. వాగుల వద్ద అక్రమ ఇసుక తరలిస్తున్న వాహనాలు పట్టుకుని జరిమానాలు వేస్తున్నాం. కిషన్, తహసీల్దార్, కోరుట్ల


ఆయుధాలు డిపాజిట్

- పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నిర్ణయం
- జిల్లాలో లైసెన్స్‌డ్ ఆయుధాలు 32
- పోలీస్‌స్టేషన్లలో డిపాజిట్ చేయాలని నోటీసులు

జగిత్యాలక్రైం: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతలపై పోలీసు అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో వ్యక్తిగతంగా లైసెన్స్ ఆయుధాలు ఉన్న వ్యక్తుల నుంచి వాటిని స్వాధీనం చేసుకునేందుకు పోలీస్‌స్టేషన్ల వారీగా నోటీసులు జారీ చేశారు. జిల్లాలో 32 మంది వద్ద లైసెన్స్‌డ్ రివాల్వర్లు ఉండగా.. బ్యాంక్ సెక్యూరిటీ కోసం 9 తుపాకులు ఉన్నాయి. ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం లైసెన్స్‌డ్ తుపాకులను ఆయా ఠాణాల్లో డిపాజిట్ చేయిస్తున్నారు. జిల్లాలో రాజకీయ నాయకులు, ప్రముఖ వ్యాపారవేత్తలు, రియల్టర్లు తదితరులు ఆయుధాల లైసెన్స్‌ను పొందారు. వీరితోపాటు ప్రైవేటు బ్యాంక్ భద్రత కోసం కూడా ఆయుధాల లైసెన్స్‌లు జారీ చేశారు. ఎన్నికల నేపథ్యంలో ఆయుధాలు ఉన్నవారు ఎవరినైనా బెదిరింపులకు పాల్పడే అవకాశం ఉండటంతో ఎన్నికలయ్యేంత వరకు వాటిని స్వాధీనం చేసుకుంటారు. రాష్ట్రంలో ఆయుధ లైసెన్స్‌లు పొందిన వారి వివరాలు సేకరించి నేషనల్ డేటా బేస్ ఆర్మ్స్ లైసెన్స్ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. లైసెన్స్ ఉన్న వారికి ఐడీ నంబరు కేటాయించారు.

ఆయుధ లైసెన్స్ పొందాలంటే..

భద్రత కోసం ప్రముఖులు, వ్యాపారవేత్తలు ఆయుధ లైసెన్స్ పొందాలంటే పలు కారణాలు చూపించాల్సి ఉంటుంది. ఆయుధం కోసం దరఖాస్తు చేసుకునేవారికి ఇతరుల నుంచి ప్రాణహాని ఉంటే లైసెన్స్ జారీ చేస్తారు. సంబంధిత వ్యక్తులకు సంఘ విద్రోహ శక్తులు, మావోయిస్టులతో సంబంధం ఉండకూడదు. రాజకీయ నాయకులకు ప్రత్యర్థి పార్టీ నుంచి ముప్పు ఉంటే లైసెన్స్‌లు ఇస్తున్నారు. పెద్ద మొత్తంలో నగదు తీసుకెళ్లే వ్యాపారులు, రియల్టర్లు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ఆస్తుల రక్షణకు లైసెన్స్‌లు జారీ చేస్తున్నారు. లైసెన్స్ కావాలంటే ముందుగా కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకుంటే దానిని రెవెన్యూ అధికారులు, పోలీసు కమిషనర్ నుంచి క్షేత్రస్థాయి పోలీస్ అధికారి వరకు పూర్తిస్థాయిలో విచారణ చేస్తారు. లైసెన్స్‌దారు మూడేళ్లకోసారి రెన్యువల్ చేయించుకోవాలి. 3 నుంచి 6నెలలకోసారి లైసెన్స్ గడువును పోలీసులు పరిశీలిస్తారు. మిలటరి రిటైర్డ్ ఉద్యోగులకు జీవనోపాధి కోసం ఆయుధాల లైసెన్స్ జారీ చేస్తారు. ఒక లైసెన్స్‌పై మూడు ఆయుధాలు కొనుగోలు చేసే అవకాశం ఉంది. ఆయుధం ఉన్న వ్యక్తులపై ఏదైనా సందర్భాల్లో క్రిమినల్ కేసులు నమోదైతే వారి లైసెన్స్ రద్దు చేస్తారు. ఆయుధాలను అనవసరంగా వినియోగించినా రద్దు చేసే అవకాశం ఉంది. ఎన్నికల అనంతరం తిరిగి లైసెన్స్‌లు ఉన్నవారికి తమ ఆయుధాలను అప్పగించనున్నారు.



తుపాకులు

ఆయుధాల డిపాజిట్ పూర్తి



పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఆదేశాల మేరకు జిల్లాలో లైసెన్స్ ఉన్న తుపాకులను ఆయా పోలీస్‌స్టేషన్లలో అప్పగించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం బ్యాంక్ సెక్యూరిటీ గార్డ్‌ల ఆయుధాలు తప్ప మిగతా వారివి తిరిగి డిపాజిట్ చేసుకుంటున్నాం. – సన్‌ప్రీత్‌సింగ్, ఎస్పీ

మండు వేసవిలో 'మ్యాడంపల్లి' దోస

- నాణ్యతకు మారుపేరు
- అత్యధిక డిమాండ్

జగిత్యాల అగ్రికల్చర్: మండు వేసవిలో డిమాండ్ ఉండటమే కాకుండా.. స్వల్పకాలంలో ఆదాయం వచ్చే దోసకాయ పంటపై ఈ గ్రామ రైతులు దృష్టి సారించారు. పంట పండించడంతోపాటు నేరుగా వినియోగదారులకు విక్రయిస్తూ.. లాభాల బాట పడుతున్నారు. ఆ గ్రామమే మల్యాల మండలంలోని మ్యాడంపెల్లి.

50 శాతం రైతులు దోస సాగు

ఈ గ్రామంలో దాదాపు 50 శాతం మంది రైతులు వేసవి పంటగా దోస సాగు చేస్తుంటారు. దోసకాయల్లో చాలా రకాలు ఉన్నా.. సన్నగా, పొడవుగా, గింజలు లేని రకాలను ఎంచుకుంటారు. ఒక్కో రైతు కనీసం 10 గుంటల నుంచి అర ఎకరం వరకు సాగు చేస్తారు. విత్తనాలను గతేడాది సాగు చేసిన దోసకాయల్లోంచి తీసి భద్రపర్చుకుంటారు. విత్తనాలు నాటాక.. మొలచిన తర్వాత 10 రోజులకు బూడిద చల్లుతారు. కలుపు మొక్కలు లేకుండా చూసి, నాలుగైదు రోజులకోసారి తడులు అందిస్తారు.

సమీప పట్టణాల్లో అమ్మకం

ప్రస్తుతం మ్యాడంపెల్లి దోసకాయలు మార్కెట్‌కు వస్తున్నాయి. కాయలు తాజాగా ఉండేందుకు ప్రతిరోజు ఉదయం ఏడు గంటలలోపు తీసి జగిత్యాల, కరీంనగర్, మల్యాల, గొల్లపల్లి, ఇతర సమీప గ్రామాలకు ద్విచక్రవాహనాలు, సైకిళ్లపై వెళ్లి విక్రయిస్తున్నారు. కాయల నాణ్యతను బట్టి ప్రస్తుతం కిలో రూ.70 నుంచి రూ.80 పలుకుతోంది. ఒక్కొక్కరు 40కిలోల వరకు తీసుకెళ్లి విక్రయిస్తున్నారు.



జగిత్యాలలో దోసకాయలు అమ్ముతున్న మ్యాడంపల్లి రైతులు

ఆ పంట గ్రామస్తులకు పవిత్రం

దోసకాయల పంటను గ్రామస్తులు అతి పవిత్రంగా చూస్తారు. స్నానం చేయకుండా తోటలోకి వెళ్తే ఎవరినీ రానివ్వరు. రైతులు కూడా వెళ్లరు. పంటలో అన్ని యాజమాన్య పద్ధతులు పాటిస్తే 10 గుంటల్లో సీజన్ ముగిసే వరకు 15 క్వింటాళ్ల వరకు కాయ వస్తుందని, దాదాపు రూ.20వేల నుంచి రూ.25వేల వరకు సంపాదించే అవకాశం ఉందని రైతులు అంటున్నారు. పెట్టుబడి ఖర్చు కేవలం రూ.5వేలలోపే ఉంటుంది. ఈ గ్రామస్తుల స్ఫూర్తితో పొరుగు గ్రామాలైన తక్కళ్లపల్లి, సుద్దపల్లి, రాఘవపట్నం గ్రామాల రైతులు దోసకాయకు సాగుకు ఉపక్రమిస్తుండటం విశేషం.

దోసకాయల ఊరుగా పేరు



నేను 15 గుంటల్లో దోస సాగు చేసిన. దోసకాయలను ఎక్కువగా సాగు చేసి, దళారులకు అమ్మకుండా మేమే అమ్ముకుంటుండటంతో మా ఊరు దోసకాయల ఊరుగా పేరుగాంచింది.

– అల్లె శంకరయ్య, దోసకాయ రైతు

తలో పట్టణానికి వెళ్తాం



నేను 30 గుంటల్లో దోస సాగు చేశాను. చాలామంది మా ఊరోళ్లు దోసకాయ పెట్టడంతో డిమాండ్‌ను బట్టి తలో పట్టణానికి వెళ్తాం. ఈసారి పంట బాగానే ఉంది. ధర గత ఏడాది మాదిరిగానే ఉంది.

– తునికి శ్రీనివాస్, దోసకాయ రైతు

సన్నని దోసకు డిమాండ్



నేను 35 గుంటల్లో దోస సాగు చేసాను. సన్నని దోసకాయను ఫిబ్రవరి చివరి నుండి మామిడికాయ వచ్చే వరకు అమ్ముతుంటాం. ఎండలు పెరిగిన కొద్ది దోసకాయకు డిమాండ్ పెరుగుతుంది.

– దిండు కిషన్, దోసకాయ రైతు

ప్రేమ పేరిట డబ్బులు వసూలు

- యువకులతో సన్నిహితంగా ఉన్నప్పుడు వీడియో రికార్డు
- తర్వాత బ్లాక్‌మెయిల్
- జగిత్యాలలో ఓ మహిళ నిర్వాకం
- ఫిర్యాదు చేసేందుకు జంకుతున్న బాధితులు

జగిత్యాల క్రైం: ఓ మహిళ డబ్బు, పలుకుబడి ఉన్న వారితో స్నేహం చేస్తూ, ప్రేమ పేరిట డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. ఇవ్వకపోతే వారితో సన్నిహితంగా ఉన్న వీడియోలను చూపిస్తూ బ్లాక్ మెయిల్ చేస్తున్నట్లు సమాచారం. జగిత్యాల జిల్లా కేంద్రంలో నివసించే ఓ మహిళ పలువురు యువకులతో స్నేహం చేసింది. ప్రేమాయాణం సాగించి, ఇంటికి పిలిపించుకొని, వారితో సన్నిహితంగా ఉన్నప్పుడు వీడియో రికార్డు చేసింది. తర్వాత తన అవసరాల కోసం డబ్బులు అడగడం ప్రారంభించింది. అడిగినప్పుడు డబ్బు ఇవ్వకున్నా, రమ్మన్నప్పుడు వెళ్లకున్నా ఆ వీడియోలు చూపిస్తూ బ్లాక్ మెయిల్ చేస్తోంది. ఇలా గత ఆరు నెలల్లో ఆమె బాధితులు 6 నుంచి 8 మంది ఉన్నట్లు తెలిసింది. ఆమె వేధింపులు భరించలేక ఒకరిద్దరు తమ సెల్ ఫోన్ నంబర్లు మార్చుకోగా మిగతావారు ఆమె చెప్పింది చేస్తూ నిత్యం ఆందోళన చెందుతున్నట్లు సమాచారం. మహిళ మోజులో పడినవారు ఆమె వేధింపులను భరిస్తున్నారు. కానీ, పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు జంకుతున్నారు. బాధితుల్లో ఒకరిద్దరి భార్యలకు ఈ విషయం తెలిసి, ఆ మహిళతో గొడవపడినట్లు తెలిసింది.

మహిళా డిగ్రీ కళాశాలకు నిధులు

- రూసా పథకం కింద రూ.5 కోట్లు కేటాయింపు
- వసతుల కల్పనకు అవకాశం



జగిత్యాల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల

జగిత్యాల: స్థానిక మహిళా డిగ్రీ కళాశాల న్యాక్ గుర్తింపు పొందడంతో రాష్ట్రీయ ఉచ్ఛతర శిక్షా అభియాన్(రూసా) కింద కేంద్రం రూ.5 కోట్లు కేటాయించింది. దీంతో కళాశాలలో వసతుల కల్పనకు అవకాశం ఏర్పడింది. ఈ కాలేజీలో అడ్మిషన్ల కోసం లెక్చరర్లు నిత్యం తపన పడేవారు. సొంతంగా కరపత్రాలు ముద్రించి, విద్యార్థులకు చేరేలా చూసేవారు. అడ్మిషన్లు, అటెండెన్స్, ఇన్నోవేటివ్ శిక్షణ ఇలా ఎన్నో రకాలుగా కళాశాల అభివృద్ధికి చర్యలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో గతేడాది న్యాక్ గ్రేడింగ్‌లో సీజీపీఏ 2.78 పాయింట్లతో బీ ప్లస్ ప్లస్ గ్రేడ్ సాధించింది. రూసా ప్రాజెక్టు ఆఫీసర్ డాక్టర్ సౌందర్య జోసెఫ్ రాష్ట్రంలో 13 కళాశాలలకు నిధులు మంజూరు చేయగా వాటిలో జగిత్యాల మహిళా డిగ్రీ కళాశాల ఒకటి.

ఒకే ఒక్క కళాశాల..

నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో ఒక్క జగిత్యాలలోనే మహిళా డిగ్రీ కళాశాల ఉంది. ఇక్కడ 1,200 మంది విద్యార్థులు చదువుతున్నారు. బీకాం కంప్యూటర్స్, బీఏ హెచ్‌ఈపీ కంప్యూటర్స్, బీఎస్సీ, బీజెడ్సీ లైఫ్‌సైన్స్, ఎంపీసీ, ఎంపీసీఎస్, బీఏ ఉర్దూ కోర్సులున్నాయి. మహిళలకే ప్రత్యేకం కావడంతో ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో విద్యార్థినులు అడ్మిషన్ తీసుకుంటున్నారు. ఒకప్పుడు అడ్మిషన్లు లేకపోవడంతో ఇబ్బందికరంగా ఉండేది. ప్రస్తుతం సీట్లు దొరకని పరిస్థితి నెలకొందంటే కళాశాల ఎంత అభివృద్ధి చెందిందో అర్థమవుతుంది.

ఆలోచించి ఖర్చు చేస్తాం



మా కళాశాలకు రూ.5 కోట్ల రూసా నిధులు మంజూరవడం ఆనందంగా ఉంది. వాటిని ఆలోచించి ఖర్చు చేస్తాం. ముఖ్యంగా బిల్డింగ్స్, 100 కంప్యూటర్లతో ల్యాబ్, జిరాక్స్ మెషిన్లు, ఈ–లైబ్రరీ ఏర్పాటు చేస్తాం. సమష్టి కృషివల్లే ఇది సాధ్యమైంది.

– సత్యనారాయణ, ప్రిన్సిపాల్

గంజాయి విక్రయిస్తున్న ముఠా అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

- 10 కిలోల గంజాయి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

జగిత్యాల క్రైం: జిల్లాలోని రాయికల్, మల్లాపూర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో గంజాయి విక్రయిస్తున్న ముఠాను అరెస్టు చేసి, 10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ తెలిపారు. శనివారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. రాయికల్ మండలంలోని ఒడ్డెరకాలనీకి చెందిన పెనుగొండ గణేశ్, లాల్యనాయక్‌తండాకు చెందిన మాలోత్ సతీశ్‌కుమార్, మల్లాపూర్ మండలం రేగుంటకు చెందిన రావులకారి నితిన్, రాయికల్ మండలం కుమ్మరిపల్లికి చెందిన తోట అజయ్, ఉప్పుమడుగులకు చెందిన ఆవుల సాగర్ ముఠాగా ఏర్పడ్డారు.

వైజాగ్ నుంచి తీసుకువచ్చి విక్రయం..

కొన్ని రోజులుగా వైజాగ్ నుంచి గంజాయి తీసుకువచ్చి రాయికల్, మల్లాపూర్ ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. పోలీసులు శనివారం ఉదయం రాయికల్–ఇటిక్యాల రోడ్డుపై వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో గణేశ్, సతీశ్‌కుమార్ పట్టుబడ్డారు. వారి బైక్‌ను తనిఖీ చేయగా 6 కిలోల గంజాయి లభ్యమైంది. మల్లాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గొర్రెపల్లి అటవీ దారిలో నితిన్ వాహనాన్ని తనిఖీ చేయగా 4 కిలోల గంజాయి దొరికింది. వీరిని పూర్తిస్థాయిలో విచారించగా విశాఖపట్నం పీలేరుకు చెందిన వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసినట్లు తెలిపారు. గణేశ్ 2015లో హైదరాబాద్‌లో ఇంజినీరింగ్ చదువుతున్నప్పుడు అక్కడి స్నేహితులతో గంజాయి సేవించడం అలవాటు చేసుకున్నాడు. ఈ ఐదుగురూ రెండు ఠాణాల పరిధిలోని యువకులకు గంజాయి విక్రయించడంతోపాటు బర్త్‌డే పార్టీల్లో సేవించినట్లు పోలీసులు గుర్తించారు. వారిని అరెస్టు చేసి, 5 సెల్‌ఫోన్లు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వైజాగ్‌లో గంజాయి విక్రయించిన వ్యక్తితోపాటు ఇక్కడ గంజాయి సేవించిన వారిని త్వరలోనే అరెస్టు చేస్తామని ఎస్పీ పేర్కొన్నారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన డీఎస్పీలు రఘు చందర్, ఉమామహేశ్వర్‌రావు, జగిత్యాల రూరల్ సీఐ ఆరిఫ్ అలీఖాన్, మెట్‌పల్లి సీఐ నవీన్, రాయికల్ ఎస్సై అజయ్, మల్లాపూర్ ఎస్సై కిరణ్‌కుమార్, సిబ్బందికి రివార్డులు అందించి, అభినందించారు.

గంజాయి పట్టివేత

మల్లాపూర్(కోరుట్ల): 4 కిలోల గంజాయిని పట్టుకున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మల్లాపూర్ మండలంలోని రేగుంటలో పోలీసులు శనివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో అనుమానాస్పదంగా కనిపించిన రేగుంటకే చెందిన రావులకారి నితిన్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద గంజాయి లభించడంతో అరెస్టు చేశారు.

ఎలక్ట్రికల్ షాపులో షార్ట్‌సర్క్యూట్



దగ్ధమైన సామగ్రి

జగిత్యాల రూరల్: జగిత్యాల అర్బన్ మండలంలోని ధరూర్‌లో శ్రీరామ్ ఎలక్ట్రికల్ అండ్ శానిటరీ షాపులో శుక్రవారం సాయంత్రం షార్ట్‌సర్క్యూట్ జరిగింది. మంటలు చెలరేగి, సామగ్రి దగ్ధమైంది. యజమాని రాచమల్ల అజయ్ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వచ్చి, మంటలు ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.4 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు.

లారీ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

మల్యాల(చొప్పదండి): లారీ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై అబ్దుల్ రహీం కథనం ప్రకారం.. చిగురుమామిడి మండలానికి చెందిన సంపత్‌రెడ్డి శుక్రవారం కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనానికి వచ్చాడు. రాత్రి ముత్యంపేట శివారులోని పంచముఖ ఆంజనేయ స్వామి సమీపంలో రోడ్డు దాటుతుండగా, లారీ వేగంగా వచ్చి, ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతను తీవ్రంగా గాయపడ్డాడు. డ్రైవర్ అజాగ్రత్తగా లారీ నడపడం వల్లే సంఘటన జరిగిందని బాధిత కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కోతుల దాడిలో మహిళకు..

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): కోతుల దాడిలో ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిపేట మండలంలోని సింగారం గ్రామంలో వాసరి భాగ్య శనివారం రోడ్డు వెంట నడుస్తూ వెళ్తోంది. కోతులు ఒక్కసారిగా ఆమెపైకి రావడంతో పరుగులు తీసింది. అయినా వెంబడించి, దాడి చేయడంతో తీవ్రంగా గాయపడింది. బాధితురాలిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. గ్రామంలో కోతుల బెడద ఎక్కువగా ఉందని, వాటిని దూరంగా తరలించాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించి, చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈతకు వెళ్లి యువకుడి గల్లంతు

మల్లాపూర్(కోరుట్ల): సరదాగా బావిలో ఈత కొట్టేందుకు వెళ్లిన ఓ యువకుడు నీటమునిగి, గల్లంతయ్యాడు. స్థానికుల వివరాల ప్రకారం.. మల్లాపూర్ మండలంలోని చిట్టాపూర్‌కు చెందిన అల్లాడి బన్ని, నిజామాబాద్ జిల్లా నందిపేట మండలం ధర్మోరాకు చెందిన శివ స్నేహితులు. శివ రెండు రోజుల క్రితం చిట్టాపూర్‌లోని బన్ని వద్దకు వచ్చాడు. శనివారం తమ స్నేహితులతో కలిసి, ఈత కొట్టేందుకు గ్రామ శివారులోని వ్యవసాయ బావి వద్దకు వెళ్లారు. బావిలో ఈత కొడుతుండగా శివ నీటిలో మునిగి, గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న బన్ని కుటుంబసభ్యులు, గ్రామస్తులు అక్కడికి చేరుకున్నారు. పోలీసులకు సమాచారం అందించడంతో వచ్చి, గజ ఈతగాళ్లతో సాయంత్రం వరకు గాలింపు చర్యలు చేపట్టారు. అయినా, ఫలితం లేకపోయింది. ఆదివారం ఉదయం మరోసారి గాలించనున్నారని స్థానికులు పేర్కొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సిరిసిల్లక్రైం: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ కోరారు. ఈమేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. సైబర్ నేరాలకు గురైతే తక్షణమే టోల్ ఫ్రీ నంబర్లు 1930, డయల్ 100కు సమాచారం ఇవ్వాలని కోరారు. సైబర్ నేరగాళ్లు ఆశ, భయం అనే రెండు అంశాల మీద మోసాలకు పాల్పడుతున్నారన్నారు. అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీని ఆసరా చేసుకుని అమాయకులకు ఆశ చూపి అందిన కాడికి దండుకుంటున్నారన్నారు. ఈ వారంలో జిల్లాలో జరిగిన పలు సైబర్ నేరాల గురించి వివరించారు.

- సిరిసిల్ల పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకరికి గుర్తు తెలియని నంబర్ నుంచి కాల్ వచ్చింది. క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామని చెప్పగా సదరు వ్యక్తి ఓటీపీ చెప్పడంతో రూ.1.70 లక్షలు నష్టపోయినట్లు ఎస్పీ తెలిపారు.
- ఇల్లంతకుంట ఠాణా పరిధిలో పార్ట్ టైం జాబ్ కోసం ఒక వాట్సాప్ నంబర్ నుంచి మెసేజ్ వచ్చింది. తర్వాత వారిని టెలిగ్రామ్‌లో యాడ్ చేసి మింత్రా యాప్‌లో ప్రొడక్ట్స్ లింక్స్ పంపారు. వాటిని స్కాన్ చేసి స్క్రీన్ షాట్ షేర్ చేస్తే డబ్బులు వస్తాయని ఆశ చూపారు. అది నమ్మిగా రూ.41వేలు మోసపోయారు.
- సిరిసిల్ల టౌన్ ఠాణా పరిధిలో సోషల్ మీడియాలో నటరాజ్ పెన్సిల్ ప్యాకింగ్ పార్ట్ టైం జాబ్ యాడ్ చూసి వారిని సంప్రదించారు. ఐడీ కార్డ్, మెటీరియల్ ఖర్చుల కోసం డబ్బులు పంపమనడంతో రూ.15 వేలు పంపి మోసపోయారు.
- వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో స్టాక్ మార్కెట్‌లో ఇన్వెస్ట్ చేపిస్తామని వారం రోజుల వ్యవధిలో ఒకరి నుంచి రూ.2.77లక్షలు పెట్టుబడిగా పెట్టించుకున్నారు. తర్వాత మోసపోయామని గ్రహించి పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేశారు.

ఓవరాల్ చాంపియన్ 'అల్ఫోర్స్'

కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్‌లోని శాతవాహన విశ్వవిద్యాలయం నిర్వహించిన మేనేజ్‌మీట్ ఆరోహణ–2024 ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను సీతారాంపూర్‌లోని అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల సొంతం చేసుకున్నట్లు కళాశాల కరస్పాండెంట్ వి.రవీందర్‌రెడ్డి తెలిపారు. శాతవాహన వర్సిటీ నిర్వహించిన ఆరోహణ–2024 పోటీల 7 అంశాల్లో బిజినెస్ క్విజ్, యాడ్‌మేకింగ్, రోల్‌ప్లే తదితర అంశాల్లో ప్రతిభ కనబరిచి చాంపియన్‌షిప్‌ను గెలుచుకున్నట్లు పేర్కొన్నారు. అలాగే వికల్ప–2024లో సైతం ఓవరాల్ చాంప్‌ను గెలుపొందడం జరిగిందన్నారు. విద్యతో పాటు వివిధ అంశాల్లో శిక్షణ, నైపుణ్యాలు మెరుగుపర్చుతూ బోధన అందిస్తున్నట్లు వివరించారు. చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్న విద్యార్థులను శనివారం అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గోళి శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్స్ డా.విజయలక్ష్మి, జి.చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చాంపియన్‌షిప్ కప్‌తో అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు

నదిలో దూకేందుకు యత్నం.. కాపాడిన పోలీసులు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): గోదావరి బ్రిడ్జిపై నుంచి నదిలో దూకేందుకు యత్నించిన ఇద్దరిని టూటౌన్ పోలీసులు కాపాడారు. వారి వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా నస్పూర్‌కు చెందిన సింగరేణి మాజీ కార్మికుడు కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ తనువు చాలించాలని గోదావరి బ్రిడ్జి వద్దకు చేరుకున్నాడు. బ్రిడ్జి పైనుంచి నదిలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించగా లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో అక్కడ ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద విధులు నిర్వహిస్తున్న టూటౌన్ ఎస్ఎస్‌టీ టీం హెడ్ కానిస్టేబుల్ ఖలీల్‌ఖాన్, జంపయ్య, కానిస్టేబుల్ పూర్ణచందర్ అడ్డుకున్నారు. కౌన్సెలింగ్ నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అలాగే గోదావరిఖని తిలక్‌నగర్‌కు చెందిన ఓ యువకుడు సైతం నదిలో దూకేందకు ప్రయత్నించగా అడ్డుకొని బంధువులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మంథని: మంథని–కాటారం ప్రధాన రహదారి నాగేపల్లి శివారులో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం వీరాపూర్ గ్రామానికి చెందిన గద్దల సమ్మయ్య(34) అక్కడికక్కడే మృతిచెందాడు. అతడి సోదరుడు సతీశ్‌కు స్వల్ప గాయాలైనట్లు ఎస్ఐ వెంకటకృష్ణ తెలిపారు. మంథని మండలం గోపాల్‌పూర్‌లో బంధువుల ఇంట్లో ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు ద్విచక్ర వాహనంపై వచ్చారు. తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా నాగేపల్లి శివారులో రహదారిపై ఉన్న కల్వర్టును ఢీకొనడంతో సమ్మయ్య మృతిచెందాడు.

క్లుప్తంగా

టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ఎన్నిక



అశోక్



శ్రీకాంత్

జగిత్యాల: టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అశోక్, కార్యదర్శిగా శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా ప్రశాంత్, సెక్రటరీగా అరుణ్, ట్రెజరర్‌గా దనేశ్, కార్యవర్గ సభ్యులుగా రమేశ్, హరీశ్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

దేవాదాయశాఖ కమిషనర్‌కు రాజన్న ప్రసాదం



కమిషనర్ హన్మంతరావుకు ప్రసాదం ఇచ్చిన ఈవో కృష్ణప్రసాద్

వేములవాడ: రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన హన్మంతరావును వేములవాడ రాజన్న ఆలయ ఈవో కృష్ణప్రసాద్ శనివారం కలిశారు. హైదరాబాద్‌లో కలిసి ఆలయ అర్చకుల మంత్రోచ్ఛరణల మధ్య స్వామి వారి ప్రసాదాలు అందించారు. ఆలయ పర్యవేక్షకులు నాగుల మహేశ్, సీసీ ఎడ్ల శివసాయి, వేద పండితులు ఉన్నారు.

ఉపాధిహామీ కూలీలపై తేనెటీగల దాడి

జూలపల్లి(పెద్దపల్లి): ఉపాధిహామీ కూలీలపై తేనెటీగలు దాడి చేశాయి. ఈఘటనలో 8 మందికి గాయాలు కాగా ఒకరి పరిస్థితి విషమంగా మారింది. వేసవి దృష్ట్యా శనివారం ఉదయమే స్థానిక–డి 83 ఉప కాలువ 9ఆర్‌పై కొందరు కూలీలు తుమ్మచెట్లు నరుకుతున్నారు. ఈక్రమంలో అక్కడే ఉన్న తేనేటీగలు లేచి వారిపై దాడికి దిగారు. దీంతో కూలీలు తలోదిక్కు పరుగులు తీశారు. ఇందులోని 8మందిని తేనెటీగలు వెంటాడి దాడిచేశాయి. గాయపడిన వారిని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. వైద్యాధికారి సంపత్‌రెడ్డి వారికి ప్రథమ చికిత్స అందించారు. ఏడుగురిని ఇంటికి పంపించారు. తీవ్రంగా గాయపడ్డ మెండె రాజవ్వను ఏపీవో సదానందం ఆధ్వర్యంలో 108 వాహనం ద్వారా కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్, లేదా హైదరాబాద్‌లోని ఆస్పత్రులకు తీసుకెళ్లాలని సూచించారని ఏపీవో తెలిపారు.

కానిస్టేబుల్ సస్పెన్షన్

మల్లాపూర్(కోరుట్ల): స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న కానిస్టేబుల్ సుదర్శన్‌ను ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ సస్పెండ్ చేశారని ఎస్సై కిరణ్‌కుమార్ శనివారం తెలిపారు. సుదర్శన్ పలు అక్రమాలకు పాల్పడుతున్నాడని గత జనవరిలో ఎస్పీకి ఫిర్యాదు వెళ్లిందన్నారు. దీనిపై విచారణ చేపట్టి, ఈ నెల 21న సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

గన్నేరువరం(మానకొండూర్): మండలంలోని ఖాసీంపేట గ్రామ శివారులో శనివారం 83.50 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. వ్యాన్‌లో బియ్యం తరలిస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించామని అన్నారు. అనంతరం సంబంధిత వాహనంతో పాటు రైస్‌ను సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించామని పేర్కొన్నారు. రాజు అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి, వాహనాన్ని సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు.

బొటనవేలి గోటిపై అమరే పనిముట్లు

- తయారు చేసిన తాండ్ర్యాల యువకుడు



విష్ణు



తయారు చేసిన గీత కార్మికుల పనిముట్లు

కథలాపూర్(వేములవాడ): మండలంలోని తాండ్ర్యాల గ్రామానికి చెందిన బండెడ్ల విష్ణు బొటనవేలి గోటిపై అమరే సైజులో గీత కార్మికుల పనిముట్లు తయారు చేసి, అందరినీ ఆశ్చర్యపరిచాడు. కల్లు గీసే కత్తి, మారు కత్తి, చిన్న ఉలి, పెద్ద ఉలి, గొడ్డలి తయారు చేశాడు. ఇతను వృత్తిరీత్యా వడ్రంగి. ఏదైనా కొత్తగా చేయాలన్న ఆలోచనతో వీటికి రూపకల్పన చేసినట్లు పేర్కొన్నాడు.







ధర్మపురిలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

ధర్మపురి: స్థానిక శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో స్వామివారి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. నాలుగో రోజు శనివారం ప్రధాన ఆలయంతోపాటు అనుబంధ ఆలయాల్లో వేలాది మంది భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు. నృసింహునికి కోడె మొక్కు, కొబ్బరి బెల్లాలు, తలనీలాలు సమర్పించారు. అంతకుముందు పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. ఆదివారం కోనేరులో స్వామివారి తెప్పోత్సవం, డోలోత్సవ కార్యక్రమం వీక్షించాలనుకున్న పలువురు ఒకరోజు ముందుగానే ధర్మపురికి చేరుకున్నారు. ఆలయం వద్ద టీటీడీ కల్యాణ మండపంలో ఉచితంగా అన్నదానం చేపట్టారు. తాగునీటి ఇబ్బందులు కలగకుండా మున్సిపల్ శాఖ, దేవాలయం తరఫున 20 చోట్ల చలివేంద్రాలు, నీడ వసతి ఏర్పాటు చేశారు.